~~255~~
621

శ్రీ శివస్తుతి

★ నవగ్రహ స్తోత్రములు ★

★

కృతికర్త

సోమంచి వాసుదేవరావు

శ్రీకాకుళం.

★

(1964)

తొలి ముద్రణము

500 ప్రతులు

విజయ లక్ష్మీ ప్రింటింగు వర్క్సు,

శ్రీకాకుళం.

(సర్వస్వామ్య సంకలితము)

621

శ్రీ శివస్తుతి నవగ్రహ స్తోత్రములు

శ్రీకాకుళములో విజయంచేసియున్న శ్రీ శ్రీ శ్రీ ఉమా రుద్ర కోటేశ్వర స్వామివారి ఆలయమున, ధ్వజస్తంభ నవగ్రహమండపముల ప్రతిష్ఠా సందర్భమున (తే 21–5–64) దీన ఈ స్తోత్రమును ముద్రించి ప్రచురించుటకు ద్రవ్య సహాయము నొనర్చిన –

గుంపిన అప్పలరాజు చిన సత్తెమ్మగార్ల పుత్రులు

శ్రీ గుంపిన రామారావుగారికి

బరాటం శంకర నారాయణ పార్వతమ్మగార్ల పుత్రులు

శ్రీ బరాటం సూర్యనారాయణగారికిని

శ్రీ శ్రీ శ్రీ ఉమా రుద్ర కోటేశ్వరులు పుత్రపౌత్రాది సంపదల నొసగి

కాపాడుదురు గాక !

శ్రీ గురుస్తుతి.

ఉ॥ దుస్తరమున్ భయంకరము దుఃఖనిదాన మపారమైకడున్
విస్తృతమైన సంసరణ నీరధి మున్గుచుఁ దేలు మూఢులన్
బ్రస్తుతముక్తిసాధన పరంపరఁ దెల్పుచు నోము సద్గురున్
ధ్వస్తసమస్తకాము, శిశునామ యతీశ్వరు సన్నుతించెదన్

055.1

శ్రీ శ్రీ శ్రీ రుద్రకోటేశ్వస్వామివారి
దేవాలయ చరిత్ర

ద్వాపరాంతమున శ్రీ కృష్ణున కగ్రజుండగు శ్రీ బలరామస్వామివారు తీర్థయాత్రలు సేవించుచు ననేకస్థలములయందు ఈశ్వరలింగ ప్రతిష్ఠలు చేయుచు లాంగుల్యా నదీతీరమునందు నైదుచోటులలో లింగ ప్రతిష్ఠలు గావించెను. వానిలో శ్రీకాకుళము సమీపమున నదీతీరమునందు శ్రీ శ్రీ శ్రీ రుద్రకోటీశ్వరస్వామి లింగ ప్రతిష్ఠయొక్కటి.

శ్రీ శ్రీ శ్రీ రుద్రకోటీశ్వరాలయము ప్రస్తుత మున్నచోటునగాక పూర్వకాలమున దీనికి దక్షిణముగా నొకటి రెండు ఫర్లాంగుల దూరమున నుండెననియు, నది కాలక్రమమున నదీప్రవాహముచే నేటిలోనికి బడిపోయెననియు, నా యీశ్వర లింగమును పానపట్ట సహితముగా ప్రస్తుత మున్న దేవాలయ స్థలమునకు దేబడెననియు పెద్దలు చెప్పుదురు. దీనికి నిదర్శనముగా పూర్వ దేవాలయముయొక్క పునాదులు నేటికిని కాన్పించుచుండుటయే సాక్ష్యము.

ప్రస్తుతమున్న దేవాలయము నేటికి సుమారు 180 సంవత్సరములకు పైగా జయనామ సంవత్సరమున నిర్మింపబడినట్లు తెలియుచున్నది. దానిని కోనాడ వాస్తవ్యులును, వైశ్యకుల శ్రేష్ఠులును మహాధర్మ కార్యాచరణ తత్పరులును అగు శ్రీ మగటపల్లి పెద్ద కామయ్యగారునిర్మించినట్లు వారి మునిమనుమలగు శ్రీ మగటపల్లి నరసింహమూర్తిగారివలన తెలియుచున్నది. స్వామివారి రాగభోగములు, ఉత్సవములు మున్నగునవి జరిపించుటకు వారును - వారి కుటుంబమువారును శ్రద్ధతీసికొనుచుండిరి. నానాడు దేవాలయముయొక్క శిథిలములయిన భాగముల మరమ్మత్తును వారును వారి కుటుంబమువారును చేయించుచుండిరి. శ్రీ నరసింహమూర్తిగారు, వారి సోదరులు సాంబమూర్తిగారును దేవాలయముయొక్క పూర్వోత్తర గోపురములు అధికవ్యయముతో సుందరముగా చేయించిరి. ఇప్పుడు జరుగనున్న దేవాలయ ధ్వజస్తంభ

ప్రతిష్ఠా సందర్భమున గూడ శ్రీ నరసింహమూర్తి గారు మిక్కిలి శ్రద్ధతీసికొని యధిక ధనసాహాయ్యముచేయ నిశ్చయించిరి. ధర్మకార్యాచరణము. పరోపకార పారీణత వితరణగరిమ వీరికి చిరాభ్యాసములయి వీరి జీవితములను ధన్యములుగా జేయుచున్నవి.

శ్రీ శ్రీ శ్రీ ఉమా రుద్ర కోటీశ్వరస్వామివారు శీతల కృపాదృష్టితో జూచి వీరిని వీరి కుటుంబస్థులను దీర్ఘాయురారోగ్య భోగభాగ్యము లొసంగి రక్షించుగాక.

స్వామివారి ధ్వజస్తంభ ప్రతిష్ఠా సందర్భమునను నవగహ మండప నిర్మాణ సందర్భమునను ఆలయోద్ధరణ సంఘమువా చేయుచున్న కృషి మిక్కిలి శ్లాఘనీయము. వారికి శ్రీ కోటీశ్వరస్వామివారు అభీష్ట సిద్ధికలుగఁ జేయుఁగాక.

ధ్వజస్తంభ ప్రతిష్ఠయు, నవగ్రహ మండప ప్రతిష్ఠయు తే 14-5-64 ది నుండి తే 21-5-64 ది వరకు జరుగును.

శ్రీకాకుళం,
5-5-64

ఇట్లు,
కృతికర్త.



శ్రీ కృష్ణపరబ్రహ్మణేనమః

-: శ్రీ గ ణే శ్వ ర స్తు తి :-

సీ॥ శ్రీ సర్వమంగళా ప్రియ కుమారుఁడు కుమా
రాగ్రజాతుఁడు సామజాననుండు
చటుల విఘ్న పయోద ఝంఝూ నిలంబు బ్ర
హ్మణ్యుండు, ప్రమథ గణాధినేత
సురదైత్య పూజిత చరణార విందుండు
తొలి పూజలనుగొను నలఘుగుణుఁడు
ఏక దంతుండు బ్రహ్మేంద్రాది సుర పూజి
తుండు విద్యాస్వరూపుండు ఘనుఁడు

గీ॥ వర యశస్కుండు, మూషక వాహనుండు
విశద భుజగేంద్ర యజ్ఞోప వీతయుతుఁడు
సత్కృపామూర్తి, దేవతా చక్రవర్తి
విఘ్నపతి ప్రోచు మము నెప్డు విపులకరుణ

-: కు మా ర స్వా మి స్తు తి :-

ఉ॥ ఆతత భక్తిఁగొల్చెద షడాననుఁ గ్రౌంచ నగేంద్రభేది, షా
ణ్మాతురు బర్హివాహను, కుమారమణీ సుతుం, దేవతాచమూ
జాత మహాధినేత, శరజాతునిఁ దారక వైరి, నాశ్రిత
వ్రాత సురావనీజముఁ గృపారస రమ్య కటాక్ష వీక్షణున్ 2

-: నం దీ శ్వ ర స్తు తి :-

గీ॥ పరమ కల్యాణమూర్తి శంకరున కెప్పు
డగ్రమున నుండి తనకు వాహనముఁ గేతు
వగుచు భక్తావనము సేయు నలఘు నంది
కేశ్వరు ప్రభావనిధి భజియింతు నెడఁద

-: శ్రీ శంకర స్తుతి :-

శా॥ శ్రీ మద్భూధర రాట్సుతాహృదయ రాజీవోరు సౌరభ్యలీ
లామాధుర్య విలోల బంభరముఁ గైలాసా చలాధిత్య కా
ధామున్ బ్రిశ్రిత సాధుభక్తజన మందారంబు, మృత్యుంజయ
స్వామిన్ శంకరుఁగొల్తు సంతతముఁ గూర్పన్ లోక కల్యాణముల్ 4

చ॥ శరధిని షంగ! శారద నిశామణి సన్నిభ దేహా! శిష్టస
త్పరిజన పోష! శీతకర భాస్కర కీలి విలోచనా! శుభా
ష్ట రుచిరరూప! శూరగణ సైన్యవిరాజిత! శేషతల్ప భా
సురశర! శైలజారమణ! శోభిత శౌర్య నిశాంత! శంకరా! 5

శా॥ క్షీరాబ్ధిన్ మథియింపఁ బుట్టిన మహాక్ష్వేళంబు భక్షించి త
త్పారావారమునన్ జనించిన సుధన్ వైమాని కార్ధంబు పెం
పారన్ వీడితి దేవదేవ! భవ దవ్యాజాను రాగంబు నీ
ధీరత్వంబు జగన్నుతంబులు కృపా దీక్షాతి దక్షా! శివా! 6

సీ॥ అల వెండి కొండ నీయిలుగాఁగ నుండ నా
మస నంపు వసతి యే మాడ్కిఁ గలిగె
నమృత భిక్షాన్న మీ నంబికయుండ నీ
కింటింటఁ దిరివమే వెంటనబ్బె
నలనిధీశుఁడు దండనలరఁ దాల్చెద వేల
సొమ్ములుగా దందశూకవితతి
అష్టభూతులు భవదంఘ్రులఁ గొలువఁ జ
ర్మము లూనెదెటు లంబరములుగాఁగ

గీ॥ నీదు లెంకల లెంకలింద్రాది సురులు
మహిత నిరుపాధి కైశ్వర్య సహితులైరి
యేల యిటు లేమి సూచింతు వీవు దేవ!
నీ చరిత్రంబు చిత్రంబు నీలకంఠ! 7

మ॥ హరినాభీ కమలంబునన్ బొడమి పంచాస్యాన్వితుండై రమే
శ్వరునాజ్ఞా భరమూని లోక రచనా పారీణుఁడయ్యున్ మృషా
పరుఁడై బ్రహ్మ గతైక శీర్షుఁడయి పోవండే భవత్కోప వి
స్ఫురణన్ దేవ! మహేశ వంచకుల కెప్డున్ సౌఖ్యముల్ గల్గునే 8

(మహిమ్నము)

సీ॥ అహిరాజ కటక! నీ మహిమార్ణవమున క
ద్దరి నెఱుంగఁగ నేరి తరముగాదు
అవిదగ్ధుఁ డొనరించు నట్టి తావక గుణ
కథనంబు యోగ్యంబుగాని యెడల
బ్రహ్మాదు లొనరించు ప్రస్తుతి వాక్యముల్
సంపూర్ణములు గావ శక్తములయి
యటుగానిచో లోకమందలి జనమెల్లఁ
దమబుద్ధి పరిపాక దశయ మేర

గీ॥ గాఁగఁ గావించు నీ స్తుతుల్ కమ్రరీతిఁ
బొగడిత సహించి యవి నింద్యమగుచు నొప్ప
కున్నవియె? దావ నా చేయనున్న యట్టి
స్తుతి సమారంభ మొప్పు నిర్దోషముగను 9

ఉ॥ దేవ! యపారమైన భవదీయ మహత్త్వ మతీతమౌను వా
చావిధికిన్ మనోగతి కశక్తత వేదముగూడ "నేతి" వా
క్యావళి పల్కుచున్నది భయంబున, నిన్ నుతిసేయ, నెమ్మదిన్
భావనసేయ నిన్ గనుఁగొనన్ వశమే భువిలోన నేరికిన్ 10

చ॥ మధురములున్ సుధారస సమానము లౌశ్రుతులన్ వెలార్చునీ
కు. ధర సుతాధిపా! గురుఁడు కూర్చునుతుల్ వెఱఁగొందఁ జేయునే
విధమున, నింక మాదృశులఁ బేర్కొననేల? భవద్గుణావళీ
కథనమునన్ బవిత్రములుగా నొనరించెద నాదు పల్కులన్ 11

మ॥ శివ ! వేదత్రియి, కాపిలంబు, మఱి వాసిష్ఠోక్త మార్గంబు, వై
ష్ణవమున్ పాశుపతంబు నాఁదనరు ప్రస్థానంబు భిన్నంబుగా
నవ్వుచుండన్ ఋజువక్ర రీతులగు నా యా దారులిచ్ఛానుసా
ర విధిన్ బొందు నరాళికీవె గతి చేరన్, వారి కబ్ధిన్ బలెన్. 12

మ॥ భవ ! వేదప్రతి పాద్యమై త్రిగుణ రూపంబొంది వాక్ఛ్రి శివా
భవమూర్తిత్రయ భేదమొంది జగదుత్పత్తి స్థితిధ్వంసన
ప్రవణంబైన భవద్విభూతి జడు లావారెప్పుడున్ దుష్ట హృ
ద్భవి గానం బొనరింతు రాత్మపతన ప్రాప్తి స్పృహాయుక్తులై 13

సీ॥ ఏతాదృగధిక విభూతి సమేతుండు
ధాతయై తా జగత్క్రియము సేయ
నెట్టి చేష్టలుగల్గి యెసఁగు నెమ్మెయిఁ దాల్చు
నెట్టి సామగ్రి వహించు నతని
కాధారమేది యుపాదాన మెయ్యది
యని యిట్లు కుత్సితంబైన యట్టి
తర్కవాక్యముల నతర్క్య విభూతిచే
నలరారు నీ విషయమున దుష్ట

గీ॥ బుద్ధు లిలఁ గొంద అవినీతి మోహపెట్టు
చున్న వారీ జగంబున నో మహేశ !
యీ జగజ్జాలమును సృజియించు నాతఁ
డీవు దక్క నన్యుఁడు మఱి యేఁడు లేఁడు 14

చ॥ అవయవ వంతమైన భువనావళి పుట్టుక లేనిదౌనె ? సం
భవ విధిఁ గర్తఁ గోరక భవంబును బొందునె యీ జగంబుల
ట్లవుటఁగు తర్కవాదులను నట్టులు సందియ మొందరాదు సృ
ష్టి విధికి దక్షుఁ డొక్క శివుఁడే కలఁ డొండొ కరుండు లేఁడికన్ 15

వ:॥ కలితశ్రీ గుణగణ్యా! నీకు వృషమున్ ఖట్వాంగమున్ దోలుఁ బా
ములు భస్మంబుఁ గుఠారమున్ బునుకయున్ ముఖ్యంబులౌ సాధనం
బులు; నీ సత్కృప నిందిరాముఖ్య దివిజుల్ భూత్యున్నతిన్ బొల్తురి
మ్ముల స్వాత్మన్ రమియించు నిన్ను విషయంబుల్ బ్రాంతి
నొందించునే? 16

సీ॥ పురహర! యీ జగంబును నిత్యమని యొక
భాట్ట దర్శనవాది పలుకుచుండు
క్షణ భంగవాది యొక్కండు బౌద్ధుం డని
త్యం బీజగంబని యాడుచుండు
మాధ్యస్థము వహించి వారి యొక క్షపణకుం
డను నిత్యము ననిత్య మని జగంబు
నీరీతి వాదించు వారిచే నవహాస్య
మొందువాఁడను బోలె నుండి నిన్నుఁ

గీ॥ బ్రస్తుతి యొనర్చుచును సిగ్గుపడఁచు నున్న
వాఁడఁ బరమేశ! నీ స్తోత్రపాఠ మందు
నాదు వాచాలత బలంబు నూఁది యతి దృ
ఢంబుగా నొప్పుచున్నది సాంబమూర్తి! 17

మ॥ భవ! నీసేవలఁ బ్రాప్తమైన బలుచేవన్ జేసి యాత్మీయబా
హువనిన్ నీరజతాద్రి యెత్తఁగ దశాస్యుం డూన నంగుష్ఠ మూ
ని వెసన్ ద్రొక్కితి వీవధోభువికి వానిన్, దుష్టుఁ డైశ్వర్యగ
ర్వ విమోహంబున ద్రోహకారిగఁ జరింపండే నిజస్వామికిన్ 18

చ॥ హర! జతనంబు లేకయె దశాస్యుఁడు ముజ్జగమున్ విరోధినా
మరహితరీతిఁ బొంది వాఁడె పూర్తిరు లేమిని మోహరంపుఁ బెం
దురద వశంబుగాసి నిజదోస్తతిఁ దాల్చుటయున్ శిరోబ్జ రా
జిరచితమౌ పదాబ్జబలి సేయుట, నీపయి బత్తి గల్గుటన్ 19

మ॥ సురరాజార్చిత ! త్వత్పదాబ్జయుగ శుశ్రూషా పరుండై ధృతి
స్థిరుఁడౌ బాణుఁడు ముజ్జగంబు స్వజనాధీనంబు గావించి వి
స్ఫుర దౌన్నత్యమునన్ మహేంద్ర విభవంబున్ గ్రిందుగాఁ జేఁత య
బ్బురమే ? యెట్టి మహా విభూతికిఁ గతంబుల్ గావు నీకౌ నతుల్ 20

చ॥ వరద ! యకాండ సారస భవాండ వినాశ విభీతులౌ సురా
సురులను బ్రోవ నెంచి కృపశోభిల నీవు విసంబు మ్రింగినన్
గరము భవద్గళంబు ఘన ఖంజనతన్ గని శోభలీనె; సు
స్థిర భువనార్తి భంగకర ధీరవికారము లౌను శ్లాఘ్యముల్ 21

చ॥ వరద ! జగత్త్రయంబున నభంగ పరాక్రమ వంతుఁడైన యా
స్మరుఁడు జయేందిరాత్త నిజ శాతశరంబుల బ్రహ్మముఖ్యులౌ
సురల జయించి వారలకు జోడని నిన్ గని మేదొఱంగె; నీ
శ్వరుని జితేంద్రియున్ బరిభవం బొనరించినఁ గీడుగల్గదే ? 22

చ॥ కువలయ మంఘ్రిఘట్టనలఁ గ్రుంగ భుజార్గళ రాజిచే దివం
బువికల తారకంబుగ, ప్రభూత జటా విచలత్తటంబుగా
దివిజును జేడ్పడన్ బశుపతీ ! భువనావనమున్ బొనర్పఁ గో
రి వడి నటించుచుందు విపరీతము నీ మహిమంబు శంకరా ! 23

మ॥ దివమున్ గప్పుచుఁ దారకావితతి నుద్దీపించు ఫేనోద్గమ
చ్ఛవి రాజిల్లుచు వార్ధి ఖేయముగ నీ సర్వంసహన్ వేగ ద్వీ
పవిధం బొందఁగఁ జేయుచున్ బొలుచు వార్భంగంబులున్ నీ జటా
వివరం బందొక బిందు వయ్యోనన నీ వృత్తం బనంతంబుగా 24

చ॥ త్రిపురతృణాళిఁ గాల్ప భవదీయ మహాహాసనంబె చాలఁగా
విపుల రథంబుగాఁగ నల వేధను సారథిగా నగేంద్రమున్
విపుల శరాసనంబుగ రవిన్ శశిఁ జక్రయుగంబుగా; రమా
ధిపుని శరంబుగా ననుమతించుట భృత్యుల తోడి క్రీడగా ! 25

మ॥ హరి నీ పాద సరోజయుగ్మము సహస్రాంభోజ పూజావిధిన్
బరిపూర్తిన్ బొనరింప నెంచ నొకపద్మం బూనమై పోవ నం
బుజపత్రం బయి యొప్పు స్వీయ నయనంబున్ నీకు నర్పించి నీ
కరుణన్ జక్రము నొంది మించెను త్రిలోకత్రాణ పారీణుఁడై 26

శా॥ దేవా! కర్మఫల ప్రదానమునఁ గర్తృత్వంబు నీ దౌట నీ
వే విశ్వంబున యాగకర్మ ఫలదాతృత్వంబునన్ బొల్తు వీ
భావం బారసి వేదవాక్యముల విశ్వాసంబునన్ లోకమున్
గావించున్ భవదర్చ నాన్వితము లౌ కర్మంబులన్ యత్నతన్ 27

మ॥ దివిజుల్ సభ్యులుగా మునీశ్వరులు ఋత్విగ్వర్యులున్ గా బ్రజా
ధవు లందొక్కరుఁడైన దక్షుఁడు క్రియాదక్షుండు నిందించి నిన్
సవనంబున్ బొనరించి నీవలనఁ దన్నాశంబు ప్రాపించె నో
భవ! శ్రద్ధారహితుల్ పొనర్చెడు మఖవ్రాతం బనర్థంబుగా 28

చ॥ తరణియు, సోముఁ డాకసము, ధారుణి వాయువు, కీలి వారియున్
బరువడి నాత్మయున్ భవ! భవద్ఘన రూపము లెన్మిదా నటం
చురుమతులైన యవ్విబుధు లీహ యొనర్తురు గాని దేవ! మా
కెఱుఁగఁగ రాదు లోకమున నెయ్యది నీవొకొ యేది కావొకో 29

సీ॥ అంజనాచలనిభం బైన కాటుకఁ దెచ్చి
కంధి సంతతయుఁ బాత్రి గాఁ గఁ జేసి
సురపాదపము శాఖ వరలేఖినిగఁ జేసి
భూతలంబును బత్రముగ నొనర్చి
ప్రణవ పీఠాధిరోహిణి శారదా దేవి
భవదీయ గుణగణ ప్రతిభ నెపుడు
వ్రాయు చున్నను దాని పారంబు తుదముట్టఁ
గా నేర దబ్రింబు గగనకేశ !

గీ॥ దుఃఖవశ్యంబు ఘనకార్శ్య దోషయుతము
నైన యీ నా మనంబేడ, మానితగుణ
పరిధి దాఁటిన నీదు ప్రభావ మేడ
యను వెఱన్ గన్న నన్ను నీ యంఘ్రిభక్తి
వాక్య పుష్పోపహారముల్ వఱలఁ జేసె

గీ॥ ఈ శివస్తోత్రరాజం బహీనభక్తి
శుద్ధ మనమున నే పురుషుండు చదువు
నాతఁ డిహమున ధనము దీర్ఘాయువును సు
పుత్త్రలబ్ధియు సత్కీర్తిఁ బొంది పరము
నందు నీశ్వర సాయుజ్య మంద నేర్చు 31

—: శ్రీ పార్వతీ స్తోత్రము :—

మ॥ జనని! శారద చంద్రికా ధవళమున్ జంద్రస్ఫుర న్మౌళియున్
ఘనమాలాభయముద్రికాకరము ని కల్యాణ రూపంబు వే
కను ధీశాలుర కబ్బు సంతతము ద్రాక్షాక్షీరమాధుర్యధు
ర్యనవ శ్రీయుత వాఙ్మకాయములు దివ్యజ్ఞాన పీయూషమున్ 32

మ॥ జననీ! వాగ్జనకంబులై యెసఁగు నా సమ్యగ్వశిన్యాది శ
క్తిని కాయంబుల తోడ నిన్ను వఁడు భక్తిన్ బూజ గావించు నా
ఘనుఁ డయ్యాది కవీంద్రతుల్యముగ వాక్కాంతా ముఖాంభోజ వా
సనలన్ దివ్యములౌ సుభాషితములన్ సత్కావ్యముల్ చేసెడున్ 33

మ॥ జననీ! షట్కమలో పరిస్థిత సహస్రారోరు చక్రంబు నం
దిన చంద్రాగ్ని మయంబునై మెఱుఁగులాఁ గెంతే విలాసంబుతోఁ
జను నీ పాదకళన్ వినిర్మల హృదబ్జాతంబున్ జూచు నా
ఘను లానంద తరంగ డోలికల నూఁగన్ జొత్తు రెల్లప్పుడున్ 34

శా॥ అంబా! తావక వామదక్షిణ లలాటాక్షుల్ లసచ్చంద్రసూ
ర్యాంబుప్రోద్భవు లౌట రేవగలు, సంధ్యల్, గల్గు నీరీతిఁ గా
లంబున్ నీ వలనన్ జనించు; నది మూలంబౌటఁ గాలంబు నీ
కుం బాధాచరణంబు గాదు మహితాకుంఠ ప్రబోధాకృతీ! 35

చ॥ నవరస భవ్యకావ్య రచనాస్త్రబ కోరు మరంద పానమున్
దవిలి శ్రుతిద్వయిన్ విడక తావక నేత్రములన్ మిషంబునన్
మివుల నెసంగు తేఁటికవ మిక్కుటమున్ గని తా నసూయ నొం
ది నెలుఁగఁ జొచ్చె నెఱ్ఱగ త్వదీయ సిటాల కటాక్ష మద్రిజా! 36

శా॥ అంబా! కౌతుకచేఁ దనర్చి భవదీయాక్షిత్రియం బెప్పుడున్
డంబై రక్తసితాసితత్రివిధవర్ణశ్రీ విరాజిల్లి బ్ర
హ్మాంబందున్ లయమౌ త్రిమూర్తులను బెంపారన్ రచింపంగ మూ
లంబై పొల్చు గుణత్రియం బనఁగ లీలన్ జెల్వగున్ శాంభవీ! 37

చ॥ అమృత రసప్రవాహ గరిమాపహృతి ప్రవణంబులైన నీ
దు మహితవాక్కులన్ బలుకుఁ దొయ్యలి కర్ణపుటంబులన్ గడున్
దమకము మీఱఁ ద్రాఁగుచు ముదంబున శీర్షము నూపఁ గుండల
భ్రమణ రవంబు పొల్చె నినుఁ బ్రస్తుతి చేయుచు నున్నదో యనన్

చ॥ భవదధ రామణ స్ఫురణ భాసిలి, కుంజర దైత్యకుంభ సం
భవ విలసన్మణీ స్థగిత మౌక్తికహారము నీ కుచద్వయిన్
దవిలి పురారి విక్రమయుతంబగు కీర్తివిధాన నొప్పె హై
మవతి! మదంబ! సత్కవి సమాజ సమర్చిత పాదపంకజా! 39

ఉ॥ నాలుక జాఱి, నీ సవతి నామముచే నినుఁ బిల్చి విన్ననన్
గ్రాలు మహేశుసిన్ బదమునన్ నిటలస్థలి నీవు తన్న,న
బ్జాలయపట్టి కాంచి నిటలాగ్ని యొనర్చు నపజ్ఞి త్రోయుచు
జాల నెసంగు హంసకని నాదమిషంబున వవ్వె నా శిఖిన్ 40

:- విష్ణుస్తుతి :-

శా॥ శ్రీరామామణి జానకీరమణియై సేవింప శేషాంశచే
నారాధిన్ జని గన్న లక్ష్మణుఁడు తోడై నిల్వ సర్వంసహా
భారంబున్ దొలఁగింప ధర్మమును బ్రోవన్ రాముఁడై యుర్విఁ జె
ల్వారన్ బుట్టిన వెన్నుఁ డోము మిము నుద్యత్సత్కృపాంభోధియై

శా॥ భూభారంబు హరింపగా యదుకులాంభోరాశిజై వాత్సకుం
డై భవ్యుండయి ధర్మరక్షణము సేయన్ గృష్ణ రూపంబునన్
శోభన్ మించిన మాధవుండు హరి విష్ణుం డిచ్చు మీకెప్డు నా
నాభద్రంబులు ముక్తి రాజ్యమహితానందానుసంధాయియై 46

-: ఆదిత్యస్తుతి :-

శా॥ శ్రీవాణీ గిరిజా మనోధవుల మూర్తిన్ దాల్చి లోకైకర
క్షావాల్లభ్యము మీఱ బంధురతమః కాండంబు ఖండించి నా
నా వేదాంత వనీ విహారకల నానందంబునన్ దేలు నిన్
భావాతీతునిఁ గొల్తు సంతతము దేవా! సూర్యనారాయణా! 47

-: ఆంజనేయస్తుతి :-

ఉ॥ రాముని సత్కథామృతముఁ ద్రావుచు, రాముని రూపమున్ మనో
ధామము నందు నిల్పుచును, దారకనామము నుచ్చరించుచున్,
రామ మయంబు గాఁగ భువనం బఖిలంబును జూచుచున్ లస
ద్భామ సుఖంబు నొందు మహితున్ నినుఁ గొల్తు సమీరనందనా!

:- విష్ణుస్తుతి :-

శా॥ శ్రీరామామణి జానకీరమణియై సేవింప శేషాంశచే
నారాయాఢిన్ జని గన్న లక్ష్మణుఁడు తోడై నిల్వ సర్వంసహా
భారంబున్ దొలఁగింప ధర్మమును బ్రోవన్ రాముఁడై యుర్విఁ జె
ల్వారన్ బుట్టిన వెన్నుఁ డోము మిము నుద్యత్సత్కృపాంభోధియై

శా॥ భూభారంబు హరింపగా యదుకులాంభోరాశిజై వాత్మకుం
డై భవ్యుండయి ధర్మరక్షణము సేయన్ గృష్ణ రూపంబునన్
శోభన్ మించిన మాధవుండు హరి విష్ణుం డిచ్చు మీ కెప్డు నా
నాభద్రంబులు ముక్తి రాజ్యమహితానందానుసంధాయియై 46

—: ఆదిత్యస్తుతి :—

శా॥ శ్రీవాణీ గిరిజా మనోధవుల మూర్తిన్ దాల్చి లోకైకర
క్షావాల్లభ్యము మీఱి బంధురతమః కాండంబు ఖండించి నా
నా వేదాంత వనీ విహారకల నానందంబునన్ జేలు నిన్
భావాతీతునిఁ గొల్తు సంతతము దేవా! సూర్యనారాయణా! 47

—: ఆంజనేయస్తుతి :—

ఉ॥ రాముని సత్కథామృతముఁ ద్రావుచు, రాముని రూపమున్ మనో
ధామము నందు నిల్పుచును, దారకనామము నుచ్చరించుచున్,
రామమయంబు గాఁగ భువనం బఖిలంబును జూచుచున్ లస
ద్భామ సుఖంబు నొందు మహితున్ నినుఁ గొల్తు సమీరనందనా!

12

నవగ్రహ స్తోత్రము

(1) సూర్యుడు

మ॥ సతసీజాప్తు సరోజహస్తు సదయున్ సన్మార్గ సంచారినిన్
సురలోకార్చితు సర్వలోక హితునిన్ సూర్యున్ ద్విమూర్త్యాత్మభా
స్కరు, బంధూక సుమాభు లోకనయనున్ ఛాయామనోవల్లభున్
హారిదశ్వున్ గ్రిహానాథుఁ గొల్తుఁ గరుణావ్యాపార పారాయణున్

(2) చంద్రుడు

సీ॥ సకలార్తిహరు, సోము సర్వజ్ఞ భూషణు
సనకాది మునిలోక వినుతుఁ జంద్రు,
సాధుపూజితు. సౌమ్యజనకు, సుధానిధి
సురలోక పన్నుతు, సుభగమూర్తి
క్షీరాబ్ధి తనయుని, శ్రీ సహజన్ము, జై
వాతృకు, నోషధీశ్వరు శశాంకు,
సితమాలికాధరు, సితవస్త్రధరుని, సి
తాత పత్రిసఁ జంద్రికాభిరాము

గీ॥ శ్వేత గంధానులేపనుఁ బూతచరితుఁ,
గుముదినీప్రియుఁ దారకారమణు, రోహి
ణీ మనోధవుఁ గొలుతు నిశామణిని, స
మస్త శుభముల మముఁ బ్రోచి మనుచుకొంటకు 50

(3) కుజుఁడు

గీ॥ ధరణిజుఁడు రక్తమాలికా ధరుఁడు, రక్త
వసనుఁ డరుణాంగుఁడును, మేషవాహనుండు
లలిత విద్యుద్రుచి విలాస కలితుఁడైన
మంగళుండిచ్చు మనకురు మంగళములు. 51

(4) బుధుఁడు

గీ॥ పీతమాల్యధరుండు, చాంపేయ కుసుమ
సన్నిభుఁడు, సౌమ్యమూర్తి, పుస్తకకరుండు,
సకల నిగమాగమాంత విశారదుండు
రోహిణీ సుతుండు, బుధుఁడెప్డుఁ బ్రోచు మమ్ము 52

(5) గురుఁడు (బృహస్పతి)

శా॥ ఆచార్యుండు సుపర్వకోటి, కురువిద్యా వైదుషిన్ మేటియై
వాచస్పత్యభిధన్ దనర్చెడు మహాప్రాజ్ఞుండు, పాకారికిన్
సాచివ్యంబు నొనర్చు నీతివిదుఁడంచద్వేద వేదాంత సా
మీచీన్యామల బుద్ధియౌ ధిషణు నెమ్మిన్ గొల్తు నిష్టార్థినై 53

(6) శుక్రుఁడు

గీ॥ శుక్ల గంధానులేపను, శుక్ల మాల్యు,
శుక్ల వసనుని, శ్రుతిశాస్త్ర సూరిఁ గవిని,
దైత్యగురు, భార్గవుని, నీతి తత్త్వవిదుని
శుక్రు, శుభమూర్తిఁ గొలిచెద శుభములొసఁగ 54

(7) శనైశ్చరుఁడు

గీ॥ నీల మాల్యానులేపను, నీలరత్న
శోభితుని, నీలవసనుని, సూర్యతనయు,
గ్రహగణోత్తము, నఖిలశాస్త్రజ్ఞు, వేద
విదు, శనైశ్చరుఁగొలిచెదఁ బ్రీతితోడ 55

(8) రాహువు

గీ॥ నీల సింహాసనస్థుని, నీలమాల్యు
నీల చందన భూషితు, నీలవసను,
సైంహికేయు, విధుంతుదు, సర్పరూపు
రాహుఁ గొలిచెద శుభముల రహి నొసంగ 56

(9) కేతువు.

గీ॥ చిత్రగంధానులేపునిఁ జిత్రవసను
ధూమ్రవర్ణునిఁ గేతుఁ గేతుస్వరూపుఁ
జంద్రసూర్యాభియాతిని. సైంహికేయుఁ
గొలుతు మాకు శుభమ్ములు గూర్చుకొఱకు 57

ఫలశ్రుతి

గీ॥ భయద కలుషాపహంబు, సౌభాగ్యవర్ధ
నంబు నగు నీ గ్రహస్తుతి నింబు మీఱ
వినిన, వ్రాసినఁ, జదివిన జనులకొదవు
శుభములు జనార్ధనుని కృపాస్ఫూర్తి నెపుడు 58

మ॥ కరుణాసాగర! చంద్రశేఖర! హరా! తూ్మభృత్యుకుమారీమనో
హర! భక్తాంబుజ బాల భాస్కర! శ్రుతి వ్యాహారసంభావితా!
సుర సంసేవిత పాద! యీ స్తుతి తతిన్ సోమంచి వంశ్యుండు సు
స్థిరభక్తిన్ దగ వాసుదేవుఁడు రచించెన్ బ్రోవు సమ్యక్కృపన్

విజయ లక్ష్మి ప్రింటింగు వర్క్సు [గాంధీపార్కు ప్రక్కన] శ్రీకాకుళం

ఈ కవిగారి యితర గ్రంధములు :-

1) సమీర సందేశము - - - వెల రూ 1-50 న॥ పై

2) శివానంద లహరి (అచ్చులోనున్నది)

3) సౌందర్య లహరి - - - - వెల రూ 0-50 న॥ పై

4) శ్రీ వెంకటేశ్వరస్తవము (అచ్చులోనున్నది)

5) నిర్వచన సుందర కాండము వెల రూ 5-00

6) స్తుతిరత్నమాలిక - - - - వెల రూ 1-25 న॥ పై

7) కిష్కింధా కాండము ప్రథమ భాగము (అచ్చులోనున్నది)

వలయువారు

సోమంచి వాసుదేవరావు

కానుకుర్తి వారివీధి : : శ్రీకాకుళం.

అను పై విలాసమునకు వ్రాయవలెను.